సాక్షి రంగారెడ్డి

సోమవారం। 9। సెప్టెంబర్। 2024



యోగాపోటీల్లో పతకం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి యోగా పోటీల్లో షాద్‌నగర్‌కు చెందిన శ్రీజారెడ్డి సత్తా చాటింది.

8లో▶



ఆమనగల్లు: మేడిగడ్డతండా వద్ద అలుగుపారుతున్న కత్వవాగు

న్యూస్‌రీల్

తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు ఆగాలి

చిలుకూరులో అర్చకులు, భక్తుల ప్రదక్షిణలు



ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు, భక్తులు

మొయినాబాద్: తెలుగు రాష్ట్రాలపై వరుణదేవుడి ప్రకోపం ఆగాలని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆలయంలో అర్చకులు, భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా రంగరాజన్ మాట్లాడుతూ.. వరదలు, విధ్వంసం, అనారోగ్యం, గాయాలు, విపత్తులు, ఆకస్మిక మరణాల నుంచి రక్షణకోసం ప్రతికూల వాతావరణ పరిస్థితులు, సంక్షోభ సమయంలో గోవింద నామస్మరణలు చేస్తూ ప్రదక్షిణం చేయాలని శాస్త్రాలు ఘోషిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనాలంటే వర్షాలు ఆగాలన్నారు. అందుకోసం స్వామివారిని ప్రార్థిస్తూ ప్రదక్షిణలు చేశామన్నారు. వరద సహాయానికి ప్రజలంతా సహకరించాలని కోరారు.

పార్కుల నిర్వహణ పట్టదా?

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



ఓపెన్ జిమ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: గత ప్రభుత్వ హయాంలో జల్‌పల్లి అర్బన్ ఫారెస్ట్‌లో ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు నిర్వహణ లోపంతో శిథిలం కావాల్సిన పరిస్థితి నెలకొందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. జల్‌పల్లి కమాన్ ప్రాంతంలోని అర్బన్ ఫారెస్ట్ పార్కును ఆదివారం ఉదయం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పార్కును కలియతిరిగిన ఆమె వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్ పార్కు, ఓపెన్ జిమ్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో రూ.59 లక్షల వ్యయంతో ఈ పార్కును అందంగా తీర్చిదిద్దినట్టు తెలిపారు. నిర్వహణ లేకపోవడంతో ఆయా పరికరాలన్నీ ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయన్నారు. అధికారులు వెంటనే స్పందించి నిర్వహణ బాధ్యత చేపడుతూ పార్కుకు వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు షర్ఫుద్దీన్ హామెద్, యంజాల జనార్దన్, సూరెడ్డి కృష్ణారెడ్డి, పల్లపు శంకర్, షేక్ అఫ్జల్, అర్జున్, గుండు నర్సింగ్, హుస్సేన్, బర్కత్ అలీ, మన్నాన్, కరీం తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే మార్పు సాధ్యం

గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌నాయక్



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: సమాజంలో మార్పును తీసుకురావాలంటే విద్యతోనే సాధ్యమని గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌నాయక్ అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న, బదిలీ, పదోన్నతులు పొందిన గిరిజన ఉపాధ్యాయులకు ఆదివారం పట్టణంలోని ఎంఆర్‌సీ భవనంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గోవింద్‌నాయక్ మాట్లాడుతూ.. పల్లెలు, గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి తమవంతు కృషి చేయాలని సూచించారు. పల్లెలు, గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదిగినప్పుడే ఆ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటు వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్‌రాథోడ్, గిరిజన ఉపాధ్యాయసంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్, ప్రధానకార్యదర్శి తావుర్యానాయక్, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్ సమీపంలో ప్రవహిస్తున్న ఈసీ వాగు



కడ్తాల్: చల్లంపల్లిలో గండి పడిన నాగుల చెరువు


వాన.. కురిసిన తరుణాన

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. భారీ వర్షానికి ఆమనగల్లు పట్టణంలోని సురసముద్రం చెరువు, మండలంలోని మేడిగడ్డతండా సమీపంలోని కత్వవాగు నిండి అలుగు పారుతున్నాయి. తలకొండపల్లి మండలంలోని చెరువులు జోరుగా ప్రవహిస్తున్నాయి. కడ్తాల్ మండలంలోని పలు చెరువులు, కుంటలు కోతకు గురయ్యాయి. వరద నీరు రహదారులను ముంచెత్తింది. మొయినాబాద్ మండల పరిధిలోని ఈసీ, మూసీ వాగులు ఉధృతంగా ప్రవహించాయి. జల్‌పల్లి పరిధిలో గొలుసుకట్టు చెరువులు నిండుకుండలా మారాయి. పలు చోట్ల పంటలు నీట మునిగాయి. ఇళ్లు, ప్రహరీలు కూలిపోయాయి.

– సాక్షి, నెట్‌వర్క్



తలకొండపల్లి: దీపునంతలో అలుగు ప్రవహిస్తున్న అల్లాయి చెరువు



పహాడీషరీఫ్: అలుగు పారుతున్న జల్‌పల్లి పెద్ద చెరువు

ఫార్మా ప్లాట్లు.. ఎన్నాళ్లీ పాట్లు?

భూములు కోల్పోయిన రైతులకు సర్టిఫికెట్లు ఇచ్చి రెండేళ్లు



మీరాఖాన్‌పేట సమీపంలో రైతులకు ప్లాట్లు ఇవ్వడానికి నిర్ణయించిన స్థలం

- నంబర్లు రాసి, కబ్జా చూపించడంలో అధికారుల జాప్యం
- ఆందోళనలో అన్నదాతలు
- నయానగరి శంకుస్థాపనతో పెరిగిన ఆశలు

యాచారం: ఫార్మా ప్లాట్లకు నంబర్లు ఎప్పుడు వేసి కబ్జా చూపిస్తారోనని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. గత బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కార్ నయానగరి నిర్మాణానికి సంకల్పించి తాజాగా శంకుస్థాపన చేయడం తెలిసిందే. నయానగరికి ఆయన శంకుస్థాపన చేసిన సమీపంలోనే రైతులకు ఫార్మా ప్లాట్లు ఇవ్వడానికి గత కేసీఆర్ సర్కార్ నిర్ణయించింది. 2017లో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధి సరిహద్దులోని 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేయడానికి సంకల్పించింది. 2017 నుంచి భూసేకరణ ప్రక్రియను ప్రారంభించి 2022 వరకు ఆయా గ్రామాల్లో దాదాపు 13,500 ఎకరాల పట్టా, అసైన్డ్ భూములను సేకరించింది. మొదట్లో అసైన్డ్‌పట్టాదారులకు ఎకరాకు రూ. 8 లక్షలు, ప్రభుత్వ భూముల్లో కబ్జా ఉన్న రైతులకు ఎకరాకు రూ. 7.70 లక్షలు, పట్టా భూములకు ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున పరిహారం అందజేశారు. అసైన్డ్ భూముల సేకరణలో రైతుల నుంచి ఇబ్బందులు రాకపోగా, పట్టా భూములకు వచ్చేసరికి రైతుల్లో వ్యతిరేకత మొదలై అసలు ఫార్మాసిటీనే రద్దు అనే అంశం పురుడుపోసుకుంది. ఫార్మాసిటీతో పర్యావరణానికి ప్రమాదం, ప్రాణకోటికి అపాయం అంటూ శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తల ప్రచారంతో రైతుల్లో మరింత చైతన్యం పెరిగి ఫార్మాసిటీనే వద్దు అనే వాదన బలంగా పెరిగింది.

వ్యతిరేకత తగ్గించడానికి..

ఆయా రాజకీయ పక్షాల అండతో అప్పట్లో రైతులు ఫార్మాసిటీకి వ్యతిరేకంగా గళమెత్తారు. ఉద్యమం తీవ్రమవుతున్న తరుణంలో స్పందించిన అప్పటి సర్కార్ ఫార్మా ప్లాట్ల గాలం వేసింది. క్రయవిక్రయాలు జరుపుకోవచ్చని పేర్కొంది. తదనంతరం బీఆర్‌ఎస్ సర్కార్ ఓటమి పాలై కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఫార్మాసిటీని రద్దు చేసి అదే స్థలంలో నయానగరి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది.

నిలిచిపోయిన అభివృద్ధి

భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల సర్టిఫికెట్లు ఇచ్చినప్పటికీ నంబర్లు వేసి, హద్దులు రాసి కబ్జా చూపించలేకపోయారు. అప్పట్లో హెచ్‌ఎండీఏ ఏర్పాటు చేసిన మెగా వెంచర్‌లో ప్రస్తుతం అభివృద్ధి నిలిచిపోయింది. యాచారం మండలంలో ఫార్మా ప్లాట్లు పొందిన నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు హెచ్‌ఎండీఏ వెంచర్ 15 కిలోమీటర్ల దూరం ఉండడం, ప్లాట్ల సర్టిఫికెట్లపై నంబర్లు వేయకపోవడం, హద్దులు రాయకపోవడంతో కొందరు రైతులు అమ్ముకున్నారు. 121 గజాల ప్లాటుకు రూ.4 లక్షల చొప్పున, 400 గజాల ప్లాట్లకు రూ.20 లక్షల చొప్పున విక్రయించారు. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో వందలాది మంది రైతులు ప్లాట్ల సర్టిఫికెట్లను అమ్ముకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తాజాగా నయానగరి నిర్ణయంతో ప్లాట్లు పొందిన మిగతా రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. చుట్టు పక్కల వ్యవసాయ భూములు, ప్లాట్లకు డిమాండ్ వస్తుండడంతో రైతుల దృష్టి మళ్లీ ప్లాట్ల నంబర్లు, కబ్జాలపైకి మళ్లింది.

ఎకరాకు 121 గజాల ప్లాటు..

మెగా హెచ్‌ఎండీఏ వెంచర్ పేరుతో కందుకూరు మండలం మీరాఖాన్‌పేట, పంజాగూడ, బెగరికంచె గ్రామాల మధ్యన 612 ఎకరాల్లో వెంచర్ ఏర్పాటు చేశారు. ఇందులో యాచారం, కందుకూరు మండలాలకు చెందిన 8 వేలకు పైగా మంది రైతులకు ఎకరాకు 121 గజాల ఫార్మా ప్లాట్లను పంపిణీ చేశారు. మెగా వెంచర్‌ను అభివృద్ధి చేసి రోడ్లు, డ్రైనేజీ మార్గం, వెంచర్‌లో క్రీడా మైదానం, విద్యా, వైద్యాశాలలు, దేవాలయాల నిర్మాణాలకు స్థలాలు కేటాయించారు. అసైన్డ్‌దారులు కొంతమంది మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు ప్లాట్ల సర్టిఫికెట్లు తమకు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నంబర్లు వేయలేదు



బెగరికంచె గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 120లోని 3 ఎకరాల అసైన్డ్ పట్టా భూమి ఫార్మాసిటీలో పోయింది. అప్పట్లో ఎకరాకు రూ.8 లక్షల పరిహారం ఇస్తే అప్పుడే ఖర్చయ్యాయి. భూమి తీసుకున్నందుకు 363 గజాల ప్లాటు సర్టిఫికెట్ ఇచ్చారు. కానీ సర్టిఫికెట్‌పై నంబరు వేయలేదు, హద్దులు రాయలేదు, కబ్జా చూపించలేదు.

– జర్పుల దేవులనాయక్, వావులికుంట తండా, కందుకూరు మండలం

ఆందోళన వద్దు



ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులు ఆందోళన చెందొద్దు. మీరాఖాన్‌పేట హెచ్‌ఎండీఏ వెంచర్‌లో ప్లాట్ల సర్టిఫికెట్లు పొందిన రైతులు అమ్ముకోవద్దు. త్వరలో సర్టిఫికెట్లు పొందిన రైతులకు నంబర్లు వస్తాయి. నయానగరి నిర్మాణంతో డిమాండ్ ఉంటుంది. రైతులు సహకరించాలి. నయానగరితో యాచారం, కందుకూరు మండలాలు ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందుతాయి.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

తెరుచుకున్న 'జంట' గేట్లు

మణికొండ: ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్‌సాగర్ జలాశయాలు నిండుకుండలా మారాయి. ఉస్మాన్‌సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1,790 అడుగులు కాగా ప్రస్తుతం 1,788 అడుగులకు చేరింది. హిమాయత్‌సాగర్ 1,765 అడుగులు కాగా 1,763 అడుగులకు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టానికి రెండు, మూడు అడుగుల దూరంలోనే ఉండటం, రాబోయే రోజుల్లో మరింత వర్షం పడే అవకాశం ఉండటంతో శనివారం సాయంత్రం ఉస్మాన్‌సాగర్ రెండు గేట్లను స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పూజలు నిర్వహించి ఎత్తి నీటిని కిందకు వదిలారు. శనివారం రోజంతా మూసీ పరీవాహకంలో ఉన్న ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని బయటకు తీసుకువచ్చారు. అనంతరం సాయంత్రం రెండు గేట్లను అడుగు మేర ఎత్తి నీటిని వదిలారు. చెరువుల పరీవాహకంలో ప్రతిరోజూ రాత్రి సమయాల్లో వర్షాలు కురుస్తుండటంతో వాగులో నీరు వస్తూనే ఉంది.

తాగునీటికి ఇబ్బంది లేదు..

రాష్ట్రంలో మంచి పాలన ఉంటే మంచి వర్షాలు కురుస్తాయని, దాంతో రాబోయే రోజుల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శనివారం గండిపేటలో గేట్లను ఎత్తిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఐదేళ్లుగా జంట జలాశయాలలో నీరు నిండుగా ఉండటంతో స్థానికంగా భూగర్భ జలాలు పెరిగాయన్నారు. రాబోయే రోజుల్లో మరింత వర్షాలు కురిసే అవకాశం ఉందనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంతో గేట్లను ఎత్తామన్నారు. మూసీ పరీవాహకంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ యాదవ్, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



గండిపేట గేట్లను ఎత్తిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

మాడ్గుల: పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు సూచించారు. మాడ్గులలో శనివారం నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పండుగలు భక్తి భావాన్ని పెంపొందించేలా ఉండాలన్నారు. గణేశ్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ వేడుకలు రెండూ ఒకేరోజు వచ్చాయని.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. సమావేశంలో సీఐ జగదీష్, ఎస్‌ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రాజు

ఉత్సవం.. ఉత్సాహం

గణేశ్ ఉత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వివిధ రూపాల్లో గణనాథుడు మండపాల్లో కొలువుదీరాడు. ఊరూవాడా 'గణేశ్ మహరాజ్‌కి జై.. గణపతి బొప్ప మోరియా..' అంటూ వినాయకుడి నామస్మరణతో హోరెత్తాయి. మండపాలను పూలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి పార్వతీ తనయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ నెలకొంది.



శంకర్‌పల్లి: సింగాపురంలో కొలువుదీరిన గణనాథుడు

మేలైన ఉపాధి కల్పనే ధ్యేయం

- ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్
- కన్హాలో ముగిసిన జాతీయ సదస్సు

నందిగామ: వ్యవసాయ, అనుబంధ రంగాల విద్యార్థులకు మేలైన ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ఆరో డీన్ కమిటీ సిఫార్సులు ఉన్నాయని, వ్యవసాయ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, స్టార్టప్ వాతావరణం కల్పించేందుకు అనుగుణంగా విద్యలో మార్పులు చేసినట్లు ఐసీఏఆర్ (భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్ అన్నారు. కన్హా శాంతి వనంలో ఐసీఏఆర్, హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారతీయ వ్యవసాయ వైస్ చాన్సలర్ల జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అగర్వాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంతగా నైపుణ్యం పెంచుకుంటే అంతగా ఉపాధి అవకాశాలు ఉంటాయని అన్నారు. భవిష్యత్తులో వ్యవసాయ విద్య అభ్యసించిన వ్యవసాయ ఆధారిత ఉద్యోగాలు పుష్కలంగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విదేశాల్లో నాణ్యమైన విద్యను అందించే విశ్వవిద్యాలయాలు, సంస్థలు స్వదేశీ విద్యాలయాలతో ఒప్పందం చేసుకోవాలని విశ్వవిద్యాలయాల చాన్సలర్లకు సూచించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, 2020 జాతీయ విద్యావిధానం సిఫార్సులను వ్యవసాయ విద్యలో చేరుస్తామని వెల్లడించారు. శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురూజీ కమ్లేష్ పటేల్ మాట్లాడుతూ.. ధ్యానంతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరిగి ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. కార్యక్రమంలో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నీరజ, భారతీయ వ్యవసాయ విశ్వవిద్యా లయాల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పర్విందర్ కౌల్, 50 మందికి పైగా వ్యవసాయ ఉద్యాన, వెటర్నరీ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, వర్సిటీ అధికారులు, ప్రొఫెసర్లు, ఐసీఏఆర్ నిపుణులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్, చిత్రంలో అతిథులు

గుండెపోటుతో కాంట్రాక్టు ఉద్యోగి మృతి

- మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళన
- కంపెనీ యాజమాన్యం జోక్యంతో విరమణ


పొట్టగళ్ల రాజు (ఫైల్)

మహేశ్వరం: విప్రో కంపెనీలో పని చేసే కాంట్రాక్టు ఉద్యోగి గుండె పోటుతో శనివారం మృతి చెందాడు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని దుబ్బచర్ల గ్రామానికి చెందిన పొట్టగళ్ల రాజు(31) మహేశ్వరం మండల కేంద్రం కేసీ తండా సమీపంలోని విప్రో కంపెనీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజుమాదిరిగా కంపెనీలో విధులు నిర్వహించడానికి లోపలికి వెళ్తుండగా ఒక్క సారి కుప్ప కూలిపోయాడు. విషయం తెలుసుకున్న కంపెనీ సిబ్బంది, సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే రాజును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కంపెనీ యాజమాన్యం ఒత్తిడితోనే తమ కుమారుడు మరణించాడని కంపెనీ ఎదుట మృతదేహంతో మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలేత్తకుండా చర్యలు చేపట్టారు. మృతుని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. దీంతో కంపెనీ యాజమాన్యం స్పందించి ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.



ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు

అర్హతలేని నర్సు డాక్టర్‌గా వైద్యం

పోలీసుల అదుపులో నిందితురాలు

ఇబ్రహీంపట్నం: అర్హతలేని ఓ నర్సు గైనిక్ డాక్టర్‌గా వైద్యం చేస్తుండగా ఎస్‌ఓటీ, స్థానిక పోలీసులు పట్టుకున్న సంఘటన ఇబ్రహీంపట్నంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక అనిరెడ్డి రామరక్ష ఆస్పత్రిలో గైనిక్ డాక్టర్‌గా వ్యవహరిస్తున్న ఎస్ ప్రవళిక (35)అలియాస్ శిరీషను పథకం ప్రకారం పట్టుకున్నట్లు తెలిపారు. జీఎన్‌ఎం కోర్సు సర్టిఫికేట్ కలిగి గైనిక్ డాక్టర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని ప్రవళికను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం: పెద్ద చెరువు బ్యాక్ వాటర్ కర్ణంగూడ గ్రామ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమయ్యింది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణంగూడ శివారు చెరువు ప్రాంతంలో ఓ వ్యక్తి చెరువులో మృతి చెంది ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు మృతదేహన్ని వెలికితీసినట్లు చెప్పారు. సుమారు 55 సంవత్సరాల వయస్సు ఉందని, గోధమ రంగు లాల్చి, తెల్లటి పైజామాతోపాటు ఎడమ చీలమండపై నల్లటి దారం కట్టి ఉందని పేర్కొన్నారు. సుమారు ఐదారు రోజుల క్రితం చెరువులో పడి మృతి చెందొచ్చని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

వర్షానికి కూలిన ఇల్లు


పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీకాంత్

తలకొండపల్లి: మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పోతుగంటి యాదయ్య ఇల్లు కూలి పోయింది. వర్షానికి గోడలు నాని పైకప్పు కూలడంతో ఇంట్లో ఉన్న భార్యాభర్తకు గాయాలయ్యాయి. ఆదివారం ఎంపీడీఓ శ్రీకాంత్ కూలిన ఇల్లును పరిశీలించారు. గాయపడిన భార్యాభర్తలిరువురిని ఎంపీడీఓతో పాటు, బీజేపీ నేత, మాజీ ఉప సర్పంచ్ అనిల్ పరామర్శించారు. అనంతరం వారు బాధితులకు 25 కేజీల బియ్యం, ఆర్థిక సాయం చేశారు.


ఆమనగల్లు: ఇంటిని తాకి ప్రవహిస్తున్న సురసముద్రం చెరువునీరు

భారీ వర్షం

ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, కాలువలు, చెరువులు నిండుకుండలా మారాయి. అక్కడక్కడ చెరువులు నిండడంతో అలుగు దుంకుతున్నాయి. జిల్లాలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నాలాలు, చెరువులు నిండాయి. కొన్ని చెరువులకు గండ్లు పడ్డాయి. వందలాది ఎకరాల్లో వరదనీరు చేరింది. కొన్ని రహదారులు కోతకు గురయ్యాయి. రోడ్లపై నీరు ప్రవహించడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


కడ్తాల్: కోతకు గురైన ఎక్వాయిపల్లి-మర్రిపల్లి రహదారి


తలకొండపల్లి:పెద్దూర్‌తండాలో తెగిన వీరన్నపల్లి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే


కడ్తాల్: చల్లంపల్లిలో గండి పడిన చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు


కడ్తాల్: సాలార్‌పూర్ సమీపంలో కోతకు గురైన రోడ్డు


మొయినాబాద్ రూరల్: అజీజ్‌నగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద


ఆమనగల్లు: సురసముద్రం చెరువునిండడంతో పారుతున్న అలుగు


తలకొండపల్లి: దేవుని పడకల్‌లో అలుగు పారుతున్న మహ్మద్‌ఖాన్ చెరువు

పబ్‌లలో పోలీసుల తనిఖీలు

నలుగురికి డ్రగ్స్ పాజిటివ్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం 10లోని బేబీలాన్ పబ్‌లో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరీక్షల్లో ఇద్దరు యువకులకు డ్రగ్స్ పాజిటివ్ రాగా వీరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్,: గచ్చిబౌలి పబ్‌లలో ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన ఈ తనిఖీల్లో మొత్తం నలుగురికి డ్రగ్స్ పాజిటీవ్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. 12 మందికి పరీక్షలు నిర్వహించామని నలుగురికి పాజిటివ్‌గా తేలిందని అధికారులు తెలిపారు.

యోగా పోటీల్లో బంగారు పతకం కైవసం

రాష్ట్ర స్థాయికి ఎంపికైన శ్రీజారెడ్డి

షాద్‌నగర్ రూరల్: యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణంలోని న్యూసిటీ కాలనీకి చెందిన శ్రీజారెడ్డి మహిళల సీనియర్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం గెల్చుకున్నారు. ఈ సందర్బంగా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి సాయి కుమార్ పతకంతో పాటు ధ్రువీకరణ పత్రం అందజేశారు.


బంగారుపతకం, ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న శ్రీజారెడ్డి

రైతుల సంక్షేమానికి కృషి

యాచారం: తెలంగాణ రాష్ట వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన ముదిరెడ్డి కోదండరెడ్డి శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కలను నగరంలోని వారి నివాసాల్లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలని, అదే విధంగా ధరణిలో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చ చర్యలు తీసుకోవాలని కోదండరెడ్డిని సీఎం సూచించారు. అనంతరం నూతనంగా నియమితులైన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో ప్రత్యేక సమావేశమయ్యారు.


సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ముదిరెడ్డి కోదండరెడ్డి

విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి


భాస్కర్ (ఫైల్)

నందిగామ: ఇంటి ఆవరణలోని నల్లా వద్ద కాలు కడుక్కోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ సపోర్ట్ వైర్ తాకి విద్యుదాఘాతానికి గురై యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని పిట్టలగూడలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పిట్టలగూడ గ్రామానికి చెందిన గంగిశెట్టి భాస్కర్ (25) ఆదివారం ఉదయం వ్యవసాయ పనినిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. సుమారు 11.30 గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగొచ్చి నూతనంగా నిర్మిస్తున్న ఇంటి ఆవరణలోని నల్లా వద్ద కాలు కడుక్కుంటుండగా పక్కనే సపోర్టుగా ఉన్న విద్యుత్ తీగ తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గోపాల కృష్ణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

మహంకాళి ఈఓకు జైలు శిక్షపై సుప్రీం కోర్టు స్టే

రాంగోపాల్‌పేట్: కోర్టు ధిక్కరణ కేసులో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయ ఈఓకు హైకోర్టు విధించిన నెల రోజుల సాధారణ జైలు, రూ.2వేల జరిమానా తీర్పుపై సుప్రీం కోర్టు స్టే మంజూరు చేసింది. చీరెలు, జాకెట్ ముక్కలు, కొబ్బరి చిప్పల సేకరణ నిమిత్తం సికింద్రాబాద్ మహంకాళి ఆలయ ఈఓ మార్చి 3న జారీ చేసిన టెండర్ నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ రాకేష్‌తో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి పిటిషనర్ల లీజును జూలై 1వ తేదీ నుంచి 5 నెలలు పొడిగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 13న కోర్టు తీర్పు ఇచ్చినా ఈఓ వాటిని ఉల్లంఘించి జూన్ 26న మళ్లీ టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారని కోర్టు దృష్టికి తెచ్చారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఈఓ కావాలనే అమలు చేయకుండా టెండర్లకు మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసి కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని పిటిషనర్లు కేసు దాఖలు చేశారు. పిటిషనర్ల వాదనలు విన్న హైకోర్టు కొద్ది రోజుల క్రితం ఈఓకు నెల రోజుల సాధారణ జైలు, రెండు వేల జరిమా విధించిన సంగతి తెలిసిందే. దీనిపై ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించగా ఈఓకు హైకోర్టు విధించిన శిక్షతో పాటు పిటిషనర్లకు 5 నెలల పాటు లీజును పొడిగించాలనే తీర్పుపై 6న స్టే మంజూరు చేసింది.

చైతన్య వర్సిటీ డీన్ అరెస్ట్

- నకిలీ ఏజెంట్లతో కాలేజీలో అడ్మిషన్లు
- కమీషన్ల పేరిట రూ.కోట్లు వసూలు
- డీన్ సుమతో పాటు మరో ఇద్దరి అరెస్టు
- సైబరాబాద్ ఈఓడబ్ల్యూ డీసీపీ ప్రసాద్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: కళాశాల రికార్డులను తారుమారు చేసి విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడంతో పాటు రూ.కోట్లలో కమీషన్ కొట్టేసిన చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ డీన్‌తో సహా మరో ఇద్దరిని సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈఓడబ్ల్యూ డీసీపీ కే ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలం, హిమాయత్‌నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో వరంగల్ జిల్లా ఖాజీపేటకు చెందిన సానికొమ్ము డీన్, ఇన్‌చార్జ్‌గా, ఇదే విభాగంలో భూతపతి దినకర్, బుర్ర శ్రీకాంత్ పనిచేస్తున్నారు. ఈ యూనివర్సిటీలో విద్యార్థులు నేరుగా, ఏజెంట్ల ద్వారా కూడా అడ్మిషన్లు పొందుతుంటారు. ఎవరైనా విద్యార్థి ఏజెంట్ లేదా ఏజెన్సీ ద్వారా ప్రవేశం పొందినట్లయితే కళాశాల యజమాన్యం సంబంధిత ఏజెంట్‌కు కమీషన్ రూపంలో కొంత సొమ్ము చెల్లిస్తుంది. ఈ అవకాశాన్ని సుమ, దినకర్, శ్రీకాంత్‌లు సంపాదనకు మార్గంగా మలుచుకోవాలని భావించిన వారు నకిలీ ఏజెంట్లను సృష్టించి, వారి పేర్లతో రికార్డులు సృష్టించారు. ఈ నకిలీ ఏజెంట్ల ద్వారా విద్యార్థులకు అడ్మిషన్లు జరిగినట్లు కళాశాల రికార్డులలో నమోదు చేశారు. దీంతో ఎప్పటిలాగే కళాశాల యాజమాన్యం ఏజెంట్లకు కమీషన్ సొమ్మును ఓచర్ల రూపంలో జారీ చేసింది. సుమారు రూ.1-2 కోట్ల నిధులను ముగ్గురు నిందితులు వారి సొంత ఖాతాల్లోకి మళ్లించారు. రికార్డుల పరిశీలన సమయంలో కళాశాల వ్యవస్థాపకుడు డాక్టర్ చింతల పాటి వెంకట పురుషోత్తం రెడ్డికి అనుమానం రావడంతో అంతర్గత విచారణ చేపట్టిన ఆయన డీన్ సుమ, మరో ఇద్దరి పాత్ర ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులపై మోసం, ఫోర్జరీ కేసు నమోదు చేసిన పోలీసులు.. సాంకేతిక ఆధారాలను సేకరించి సుమ, దినకర్, శ్రీకాంత్‌లను అరెస్టు చేశారు. వీరి నుంచి మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

మంచు విష్ణుకు సైబర్ వేధింపులు

- ఆయనతో పాటు నిర్మాణ సంస్థ పైనా ట్రోలింగ్
- కేసు నమోదు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు
- నిందితుడికి నోటీసులు జారీ చేసిన అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు మంచు విష్ణుకు సైబర్ వేధింపులు తప్పలేదు. సోషల్‌మీడియా ద్వారా ఈ పని చేస్తున్న విజయ్ చంద్రహాసన్ దేవరకొండను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నోటీసులు జారీ చేసి పంపారు. నేరం నిరూపణకు అవసరమైన ఆధారాలు సేకరించి, నిందితుడిపై న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేయాలని నిర్ణయించారు. విజయ్ చంద్రహాసన్ ఓ యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నారు. దీంతో పాటు వివిధ సోషల్‌మీడియా ఖాతాల్లో అనేక వీడియోలు అప్‌లోడ్ చేశారు. వీటిలో మంచు విష్ణు, ఆయనకు సంబంధించిన నిర్మాణ సంస్థ, 'మా'లతో పాటు సినీ రంగాన్నీ కించపరిచే, అవమానించే, అభ్యంతరకరంగా చిత్రీకరించే అంశాలను పొందుపరిచాడు. ఇతను పదేపదే ఇదే పంథా అనుసరిస్తుండటాన్ని 'మా' సీరియస్‌గా తీసుకుంది. సంస్థ ట్రెజరర్ శివబాలాజీ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ కె.మధులత సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించారు. విజయ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించాడు. దీంతో అతడికి నోటీసులు జారీ చేసిన అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. త్వరలోనే అవసరమైన ఆధారాలను సేకరించి, న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని నిర్ణయించారు.

రైలు కిందపడి ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆత్మహత్య

రాంగోపాల్‌పేట్: ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం ..అంబర్‌పేట్‌కు చెందిన నరసింహరాజు (39) గోపాలపురం పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. అతడికి భార్య మాధవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అప్పుల కారణంగా ఆరు నెలల క్రితం సొంత ఇంటిని అమ్మేసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం డ్యూటీకి రాకపోవడంతో పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఇంటి నుంచి బయటికి వచ్చిన అతను తన బైక్ పొదల్లో పెట్టి ఘట్కేసర్-బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం దీనిని గుర్తించిన కీ మెన్ జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించాడు. ఘట్కేసర్ పోలీసులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులు, గోపాలపురం ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.